క్లుప్తంగా

మార్వెల్ల సింగిల్‌విండో చైర్మన్ రాజీనామా

తుగ్గలి: మండలంలోని మార్వెళ్ల అశోక పరపతి సహకారం సంఘం చైర్మన్ పెండేకల్లు అట్ల గోపాల్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల తనతో పాటు డైరెక్టర్లు మధుసూదనరెడ్డి, తిమ్మప్ప రాజీనామా చేశామన్నారు. శనివారం సొసైటీ కార్యదర్శి మనోహర నాయుడు ద్వారా డివిజనల్ అధికారికి తమ రాజీనామాలు పంపినట్లు తెలిపారు.

18న కూర్మ జయంతి



ఉత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మ నారాయణస్వామి జయంతిని ఈనెల 18న నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు నరేష్ తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల కరపత్రాలను భక్తులు విడుదల చేశారు. ఈనెల 18న ఆలయంలో స్వామి వారికి క్షీర, చందన, పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, గిరిప్రదక్షిణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆదర్శపాఠశాలలో ఖాళీ సీట్లు భర్తీ

మద్దికెర: 2024–25 విద్యా సంవత్సరానికి స్థానిక ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 15న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సవిత శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు పాఠశాలలోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మాన్యం కౌలుకు వేలం

మద్దికెర: మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయానికి సంబంధించిన 43 ఎకరాల మాన్యాన్ని మూడేళ్ల కౌలుకు ఈనెల 13 వేలం నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

మండలంలో భారీ వర్షం



బురుజుల వద్ద రహదారిపై పొంగిపొర్లుతున్న వంక

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి, బురుజుల తదితర గ్రామాల పరిసరాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. బురుజుల – పత్తికొండ రహదారిపై వర్షపునీరు అధికంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఆధార్, పాన్ కార్డుల జిరాక్స్‌లను అందజేయాలి

కృష్ణగిరి: మండల కేంద్రంలోని కృష్ణగిరి ప్రాథమిక వ్యవసాయ సహకారం సొసైటీలో సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరు తమ ఆధార్, పాన్ కార్డు జిరాక్స్‌లను కార్యాలయంలో అందజేయాలని సొసైటీ సీఈఓ శివన్న కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆధార్, పాన్‌తో పాటు మొబైల్ నంబర్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను అందజేస్తే, సొసైటీలో ఉన్న ప్రతి ఒక్కరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9182972735 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

అంజన్నకు విశేష పూజలు



పూజలందుకున్న క్షేత్రగుడి ఆంజనేయస్వామి

హాలహర్వి: మండలంలోని క్షేత్రగుడి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం భక్తులు అర్చకులు ప్రహ్లాద్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, కుంకుమార్చన, ఆకు పూజ తదితర పూజలు చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

అగ్రహార ఆంజనేయస్వామికి..

హొళగుంద: మండల పరిధిలోని తెల్లకొండ వద్ద వెలిసిన అగ్రహార ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

దోమా.. కుట్టకే!



- మలేరియా, డెంగీతో తస్మాత్ జాగ్రత్త
- అశ్రద్ధ వహిస్తే తీవ్ర జ్వరంతో ప్రాణాలు పోయే ప్రమాదం
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలంటున్న వైద్యులు



ఆలూరులోని ఎల్లార్తి రోడ్డులో నిలిచిన మురుగునీరు

ఆలూరు రూరల్: మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. నియోజకవర్గంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, నివాస పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటోంది. దీంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వాధులకు కారణమవుతున్నాయి. దోమ కాటుకు గురి కాకుండా, జ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

డెంగీ, మలేరియా లక్షణాలు..

డెంగీ ప్రధాన లక్ష్యం 15 రోజుల పాటు జ్వరం ఉంటుంది. తలనొప్పితో రోగి చాలా బాధపడతాడు. కడుపునొప్పి కూడా వస్తుంది. మలేరియా వ్యాధి అనాఫిలిస్ అనే దోమకాటు వల్ల వస్తుంది. వర్షాకాలంలో దోమలు పెరిగే ప్రదేశాలు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతుంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, మూత్రం మందగించడం, లివర్, కడుపులో నొప్పి, జ్వరం మూడు రోజులకోసారి, రెండు రోజులకోసారి లేదా రోజూ వస్తూ ఉండటం ఈ వ్యాధి లక్షణాలు.

ఉచితంగా పరీక్షలు

నియోజకవర్గంలోని 11 పీహెచ్‌సీలతో పాటు ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ గంట వ్యవధిలోపు చేస్తారు. రక్తం సేకరించి వ్యాధి నిర్ధారణ జరిగితే క్లోరోక్విన్, ప్రైమాక్విన్ మాత్రలు ఇస్తారు. న్యూడ్రగ్ పాలసీ ప్రకారం ఈ మందుతులు తప్పనిసరిగా 14 రోజుల పాటు వాడాలి.

దోమలు పెరగకుండా జాగ్రత్తలు

ఇంటి పరిసరాలతో పాటు దోమలు పెరిగేందుకు ఆస్కారం లేకుండా మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ప్రతి శుక్రవారం ఇంటిలో నీటి నిల్వలు లేకుండా డ్రైడే పాటించాలి. ఇంటి ఆవరణంలో ఖాళీ కొబ్బరి, కొబ్బరి బొండాలు, పాతటైర్లు, రోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. దోమలు ఇంటిలోకి రాకుండా నియంత్రించేందకు ఉదయం, సాయంత్రం కిటికీలు మూసివేయాలి. లెట్రిన్ పైపుల పైన వస్త్రాన్ని కప్పి ఉంచాలి. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలు వాడటం ద్వారా దోమకాటు బారినపడకుండా కాపాడుకోవచ్చు.



మఠ్రిస్వామి మఠం వీధిలో డెంగీ సోకిన బాలుడి ఇంట్లో పిచికారీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

మలేరియా నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు



మలేరియా నివారణ కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవగాహన కోసం ర్యాలీలు నిర్వహిస్తున్నాం. జూన్ నుంచి మలేరియా, డెంగీ కేసులు నమోదయ్యే అవకాశాలున్నాయి. ప్రజలు వ్యాధులపై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం.

– మంజునాథ్, ఆదోని సబ్ యూనిట్ మలేరియా నివారణ అధికారి

దోమల నుంచి రక్షణ పొందాలి



ఇటీవల కాలంలో అక్కడక్కడా వైరల్ ఫీవర్ నమోదు అవుతున్నాయి. దోమ కాటు నుంచి రక్షణ పొందాలి. వైరల్ ఫీవర్ వస్తే మందులు వాడితే తగ్గిపోతుంది. అలా కాకుండా జలుబు, తలనొప్పి, వాంతులు, ఒంటిపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. అజాగ్రత్తగా ఉంటే వ్యాధి తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో రోగాలను అధిగమించవచ్చు.

– రవి, డాక్టర్, మొలగవల్లి పీహెచ్‌సీ

అందుబాటులో రాయితీ విత్తనాలు



రామళ్లకోటలో కొర్ర విత్తనాలు రైతుకు అందిస్తున్న ఏఓ, వీహెచ్‌ఓ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని అన్ని ఆర్బీకేలలో రాయితీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ అక్బర్‌బాషా తెలిపారు. శనివారం ఆయన వెల్దుర్తి ఆర్బీకేలో నిల్వ ఉన్న వేరుశనగ రాయితీ విత్తనాలను పరిశీలించారు. అనంతరం రామళ్లకోట ఆర్బీకేలో రాయితీ కొర్ర విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీ పోనూ వేరుశనగ క్వింటం రూ.5,700, కందులు 4 కేజీల ప్యాకెట్ రూ.392, కొర్రలు 2 కేజీలు రూ.88 చెల్లించి తీసుకోవాలన్నారు.

ఎన్‌డీపీఐ బలోపేతానికి కృషి

హొళగుంద: ఎస్‌డీపీఐ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జనాబ్ హాఫీజ్ అతవుల్లా ఖాన్, మహమ్మద్ గని అన్నారు. శనివారం వారు స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. 400 సీట్లు సాధిస్తామనే నినాదం బీజేపీకి వికటించిందన్నారు. బొటాబొటి సీట్లతో ఎన్‌డీఏ సర్కార్ ఊపిరి పీల్చుకోవాల్సి వచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ రహిమాన్, కార్యదర్శి రహిమాన్, నాయకులు షఫి, బాషా, చికెన్ బక్షి పాల్గొన్నారు.

కొనసాగుతున్న జైన దిగంబర స్వాముల పాదయాత్ర



వెల్దుర్తి పట్టణం గుండా సాగుతున్న జైన స్వాముల పాదయాత్ర

వెల్దుర్తి(కృష్ణగిరి): కర్ణాటక రాష్ట్రం శ్రావణ బెళగల్ నుంచి ప్రారంభమైన జైన మత దిగంబర స్వాముల పాదయాత్ర శనివారం కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల మీదుగా సాగింది. అహింస, సన్మార్గం, ఆత్మలీనం సందేశాన్నందిస్తూ జైన మత ప్రబోధకుడు ఆచార్య ప్రసన్న సాగర్ మహారాజ్, మరో 15 మంది దిగంబరస్వాములతో కలిసి హైదరాబాద్‌లోని కుల్పారం జైన ఆలయానికి పాదయాత్రగా బయలుదేరారు. శనివారం ఉదయం డోన్ నుంచి ప్రారంభమై హైవే 44 మీదుగా సాయంత్రం ఉలిందకొండ చేరుకున్నారు. కృష్ణగిరి అమకతాడు టోల్‌గేట్ అనంతరం వెల్దుర్తి పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా దిగంబర స్వాములను పలువురు దర్శించుకుని ఆశీర్వాదం పొందారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆలూరు: విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు కేసీ నరసప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల క్రితం యూనియన్ తనను ఏకగ్రీవంగా ఎన్నుకుందన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, హెచ్‌ఆర్, హెల్త్ కార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్మికులు కూడా మెరుగైన సేవలందించి ప్రజల మెప్పు పొందాలన్నారు.

సహకార సంఘం అధ్యక్షురాలి రాజీనామా

దేవనకొండ: సహకార సంఘం (కేడీసీసీ) అధ్యక్షురాలు లక్ష్మిదేవమ్మ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని శనివారం సీఈఓ రహంతుల్లాకు అందజేశారు. లక్ష్మిదేవమ్మతో పాటు మరో ఇద్దరు సభ్యులు పి.రామాంజనేయులు, ఎం.జి.లక్ష్మిదేవమ్మలు కూడా రాజీనామా చేశారు.

ప్రమాదకరంగా కల్వర్టు



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

హొళగుంద: హొళగుంద– ఆదోని రోడ్డులోని వంతెనపై నిర్మించిన కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. ఆ ప్రాంతాల్లో అధికారులు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోగా ఎలాంటి రక్షణ గోడలు లేవు. దీంతో కల్వర్టు కూడా మలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రక్షణ గోడ, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కురిసింది వాన!

పత్తికొండ రూరల్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో రెండో రోజు వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం నుంచి వరుణదేవుడు తెరపినివ్వకుండా సాయంత్రం వరకు మోస్తరుగా వాన పడి వాతావరణం బాగా చల్లబడింది. వర్షం రాకతో చిరువ్యాపారులు కాస్త ఇబ్బంది పడ్డారు. ప్రధాన రోడ్డులో నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొదటి వారంలోనే కురిసిన రెండు, మూడు వర్షాలతో ఖరీఫ్ సాగును రైతులు మొదలు పెట్టారు. ఖరీఫ్ సాగుకు వర్షం అదునుగా వ్యవసాయ అధికారులు, రైతులు పేర్కొంటున్నారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షంతో వాగులు, వంకల ద్వారా ప్రవహించిన నీటితో పత్తికొండ చెరువు జలకళను సంతరించుకుంది.



రెండేళ్ల తరువాత జలకళ సంతరించుకున్న పత్తికొండ ఊరిచెరువు

వైద్య పరీక్షల రిపోర్టులు త్వరగా ఇవ్వాలి

- ల్యాబ్‌టెక్నీషియన్లతో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ సి. ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): సుదూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలకు సంబంధించిన రిపోర్టులు సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలని పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ల్యాబ్‌టెక్నీషియన్లకు ఆదేశించారు. శనివారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో మైక్రోబయాలజీ, పెథాలజీ, బయోకెమిస్ట్రీ, బ్లడ్‌బ్యాంకుల్లో పనిచేసే ల్యాబ్‌టెక్నీషియన్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఈ–హాస్పిటల్ డేటా ఎంట్రీ ప్రాసెస్ గురించి ఆరా తీశారు. ఎప్పటికప్పుడు రిపోర్టులు త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్లు ఎఫ్‌ఆర్‌ఎస్‌తో పాటు హాజరు రిజిస్టర్‌లో సిబ్బంది సంతకం ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ఆసుపత్రిలోని సిబ్బంది సమయపాలన పాటించాలని, వారు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారన్న విషయాలపై రికార్డు నిర్వహించాలని చెప్పారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌కి ఇన్‌చార్జ్‌గా డాక్టర్ సునీల్ ప్రశాంత్‌ను నియమించినట్లు తెలిపారు. ఆయన ప్రతిరోజూ పర్యవేక్షణ చేస్తారన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్లు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు. బయోకెమిస్ట్రీకి త్వరలో రెండు కంప్యూటర్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై హత్యాయత్నం

- నలుగురికి తీవ్రగాయాలు
- బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



కర్నూలు ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని అల్లుగుండు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గొల్ల పెద్ద మాదన్న, మనోహర్, మోహన్‌కృష్ణ, చిన్న మాదన్నలపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శివ, అతని కార్యకర్తలు శుక్రవారం రాత్రి హత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న వెల్దుర్తి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి హుటాహుటిన గ్రామానికి చేరుకుని క్షతగాత్రులను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, నాయకులు అల్లుగుండు శ్రీరాంరెడ్డి, గోపి తదితరులు ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ టీడీపీ వారి ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. పోలీసులు అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా టీడీపీ నాయకుడు శివతో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

వీఆర్‌ఓపై దాడి

వెల్దుర్తి వీఆర్‌ఓ ప్రసాద్‌పై టీడీపీ నాయకలు దాడి చేశారు. ముందుగా మాజీ ఎంపీపీ ఎల్‌ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్ పిలుస్తున్నాడంటూ టీడీపీ కార్యకర్తలు ఫోన్ చేశారు. దీంతో విధులు ముగించుకుని సాయంత్రం ఎల్‌ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్ ఇంటికి వెళ్లాడు. ఆయనతో మాట్లాడుతుండగానే అతని అనుచరులు హరి, మౌలాలి తమ పని చేయవా అంటూ దుర్భాషలాడుతూ దాడి చేశారంటూ వీఆర్‌ఓ ప్రసాద్ వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హరి, మౌలాలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

నిషేధం ఎక్కడ?

- ప్లాసిక్ కవర్ నియంత్రణలో విఫలమవుతున్న అధికారులు
- దుకాణాల్లో యథేచ్ఛగా తక్కువ మైక్రోన్ కవర్ల వాడకం
- ఆరోగ్యానికి హానికరమంటున్న వైద్యులు



కుప్పలు కుప్పలుగా పడివున్న ప్లాస్టిక్ కవర్లు



ఆలూరు రూరల్: ప్లాస్టిక్ నిషేధం కేవలం రికార్డులకే పరిమితమైంది. అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో నిషేధం అమలు కావడం లేదు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. వాస్తవానికి ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్న షాపుల్లో అధికారులు తనిఖీలు నిర్వహించి తక్కువ మైక్రోన్లు కలిగిన కవర్లు కలిగి ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. అయితే నిబంధనల అమలులో అధికారులు విఫలమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్లాస్టిక్ విరివిగా దొరుకుతుండడంతో ప్రజలు సైతం ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవడం లేదు. ఫలితంగా రోజురోజుకు వినియోగం పెరుగుతోంది. దీంతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధించిన కేంద్రం

నియోజకవర్గంలో ప్లాస్టిక్ కవర్లు వినియోగం జోరుగా సాగుతుంది. కిరాణా దుకాణాలు, కూరగాయలు, పండ్ల విక్రయాలు, హోటళ్లు, ఇలా అన్ని చోట్లా తక్కువ మైక్రోన్లు కలిగిన ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. 2019 ఏడాది జూలై ఒకటి నుంచి దేశంలో 16 రకాల ప్లాస్టిక్ కవర్లు నిషేధించినట్లు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పలు మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీలలో పేపర్లతో తయారు చేసిన కవర్లు, బట్ట సంచులు వినియోగించాలని ఆదేశాలు జారీ చేసి అమలు చేస్తున్నారు. కానీ ఆలూరు నియోజకవర్గంలో మాత్రం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో పరిస్థితులలో మార్పు కనిపించడం లేదు. మరో వైపు ప్లాస్టిక్ విక్రయించే దుకాణాదారులకు అధికారులు తనిఖీలకు వస్తున్నట్లు ముందుగానే సమాచారం అందుతోందని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్లాస్టిక్ వినియోగంపై కఠినంగా వ్యవహరించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



ప్లాస్టిక్ కవర్లో కూరగాయలు ఉన్న చిత్రం

కఠిన చర్యలు తప్పవు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగేళ్ల క్రితం ప్లాస్టిక్ కవర్లను నిషేధించాయి. ప్లాస్టిక్ కవర్ల నియంత్రణ తక్షణ చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా షాపులలో తక్కువ మైక్రోన్ల ప్లాస్టిక్ కవర్లు వాడితే అలాంటి షాపు యజమానులపై జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకుంటాం. పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ వాడడం మానుకోవాలి. వాటికి బదులు పేపర్లు, జనుమ సంచులను వాడాలి. అవసరమైతే కేసులు నమోదు చేస్తాం.

– ప్రకాష్ నాయుడు, పత్తికొండ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



ప్లాస్టిక్ కవర్లను వినియోగించడం వల్లా ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లలో వాడిన పదార్థాలతో క్యాన్సర్ వ్యాధి బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. ఇది ఎక్కువగా పిల్లలు, వృద్ధులకు ప్రభావం చూపుతుంది. ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది.

– వాహిద్, డాక్టర్, ఆలూరు

ఘనంగా సిద్ధప్ప తాత జాతర



పూజలందుకుంటున్న సిద్ధప్పతాత మూలవిరాట్



భక్తజన సందోహం మధ్య రథోత్సవం

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో వెలసిన మహాయోగి సిద్ధప్పతాత జాతర శనివారం కనుల పండుగగా జరిగింది. తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాక కర్ణాటక నుంచి వేలాది భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పరవీధుల గుండా రథోత్సవ కార్యక్రమాన్ని భక్తుల కోలాహలం మధ్య ఘనంగా చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుడిసె దగ్ధం

కోసిగి: మండలంలోని దుద్ది గ్రామానికి చెందిన ఎండపల్లి మూకయ్య గుడిసె శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. గుడిసెలో మంటలు గమనించిన గ్రామస్తులు బిందెలతో నీళ్లు పోసి ఆర్పేశారు. కాగా రూ.50 వేల నగదు, బంగారం, తిండి గింజలు, బట్టలు, వంట సామగ్రి, టీవీ కాలి బూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ.4 లక్షలు వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.